## ప్రశాంతంగా గురుకుల ప్రవేశపరీక్ష

ప్రజాశక్తి - కురుపాం

పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

స్థానిక మహాత్మ జ్యోతిరావు పూలే వెనుకబడిన తరగతులు బాలుర గురుకుల పాఠశాలలో వివిధ తరగతుల ప్రవేశ పరీక్ష ప్రిన్సిపల్ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ తరగతులకు ఖాళీగా ఉన్న 62 సీట్లకు 86 మంది అప్లై చేయగా 72 మంది విద్యార్థులు పరీక్షలు రాశారన్నారు. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారికి సీట్లు కేటాయిస్తామన్నారు.



దాసరి సాకేత్‌నాయుడు
12వ ర్యాంకు

యశస్వినాయుడు
316వ ర్యాంకు

ఎ.హేమంత్‌కుమార్
866వ ర్యాంకు

శంబంగి వర్షిణి
929వ ర్యాంకు

యువరాజ్‌నాయుడు
1793వ ర్యాంకు

### జెఇఇ అడ్వాన్స్‌డ్‌లో

# సత్తా చాటారు

ప్రజాశక్తి-సార్వతీపురం రూరల్

జెఇఇ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు సత్తాచాటారు. ఓపెన్ కేటగిరీలో వందలోపు ర్యాంకులు సాధించి అదరగొట్టారు. పార్వతీపురం విద్యార్థులు ప్రతిభ చాటారు. పట్టణానికి చెందిన దాసరి సాకేత్ నాయుడు ఆల్ ఇండియా 12వ ర్యాంకు, ఓబీసీ కేటగిరీలో ఫస్ట్ ర్యాంకు సాధించారు. పార్వతీపురంలో ఉంటున్న నందివానివలసకు చెందిన శంబంగి వర్షిణి ఆల్ ఇండియా 929వ ర్యాంకు, ఒబిసి కేటగిరీలో 156 ర్యాంకు సాధించింది. కాగా వీరి తల్లిదండ్రులు టీచర్లుగా పనిచేస్తున్నారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన వీరిని పలువురు అభినందిస్తున్నారు.

**యశస్వి నాయుడుకు 316వ ర్యాంక్**

**బలిజిపేట** :మండలంలోని పెద్దింపేటకు గ్రామానికి చెందిన వెన్నెల యశస్వింత్‌నాయుడు ఐఐటి అడ్వాన్స్‌డ్‌లో ఆల్ ఇండియా 316 ర్యాంకు సాధించాడు. ఒబిసి కేటగిరిలో 49 ర్యాంకు వచ్చింది. మెయిన్స్ ఆలిండియా 111 ర్యాంకు సాధించగా, ఒబిసి కేటగిరీలో 19వ ర్యాంకు సాధించాడు. యశస్వింత్ తండ్రి ఉపాధ్యాయుడు కాగా, తల్లి గృహిణి.

**866వ ర్యాంకు సాధించిన హేమంత్‌కుమార్**

**పాలకొండ** : ఆదివారం విడుదలైన జెఇఇ అడ్వాన్స్ ఫలితాల్లో పట్టణంలోని చీమలవీధికి చెందిన అంపిలి హేమంత్‌కుమార్ ప్రతిభ చూపాడు. జాతీయ స్థాయిలో 866వ ర్యాంకును సాధించాడు. ఒబిసి కోటాలో 146వ ర్యాంకు దక్కింది. ఎల్‌కెజి నుంచి 6వ తరగతి వరకు వివేకానంద మోడల్ స్కూల్‌లో చదువుకుని 7వ తరగతి నుంచి ఇంటర్ వరకు విశాఖ శ్రీచైతన్యలో విద్యనభ్యసించారు. తండ్రి రామకృష్ణ తాపీమేస్త్రీగా పనిచేస్తూ జీవనం సాగిస్తుండగా తల్లి లక్ష్మి గృహిణి.

**1793 ర్యాంకు సాధించిన యువరాజ్ నాయుడు**

**వీరఘట్టం** : మండల కేంద్రమైన వీరఘట్టానికి చెందిన మజ్జి యువరాజు నాయుడు జెఇఇ అడ్వాన్స్ ఫలితాల్లో సత్తా చాటాడు. ఒబిసి కేటగిరిలో 1793 ర్యాంకుతో ఉత్తీర్ణ సాధించాడు. విజయవాడ శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యాభ్యాసం పూర్తి చేశాడు.

## వేదాంతకు ఐఐటి ర్యాంకుల పంట

హరిప్రియ దర్శిని
1917వ ర్యాంకు

ప్రజాశక్తి- పార్వతీపురం టౌన్

స్థానిక వేదాంత జూనియర్ కళాశాల విద్యార్థులు జెఇఇ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ర్యాంకులు సాధించారని చీఫ్ మెంటర్ పెంట అప్పారావు, ప్రిన్సిపాల్ ఎస్ఎల్ నాయుడు తెలిపారు. తమ కళాశాల విద్యార్థులు పూడి హరిప్రియ దర్శిని 1917 ర్యాంకును సాధించగా, తుమ్మిడు సుజిత్ కుమార్ 3840, కడియాల గౌతం కుమార్ 2636 కేటగిరి ర్యాంకులను సాధించారన్నారు. తమ విద్యార్థులు సాధించిన ర్యాంకులు జిల్లాలోనే కార్పొరేట్ కళాశాలలకు ధీటుగా సాధించారన్నారు. వీరితో పాటు మరి కొంతమంది విద్యార్థులు ఐఐటి, నిట్‌ల్లో సీట్లను సాధించడం సంతోషంగా ఉందన్నారు. వేదాంత కళాశాలలో ర్యాంకులు సాధించడంతో పండగ వాతావరణంలో నెలకొంది. ఇంతటి ఘనవిజయాలు సాధించిన విద్యార్థులను, అందుకు సహకరించిన అధ్యాపకులను, విద్యార్థుల తల్లిదండ్రులను అభినందించారు.

కె.గౌతంకుమార్
2636 ర్యాంకు

సుజిత్‌కుమార్
3840వ ర్యాంకు

## సైన్స్, చరిత్ర పాఠాలు తొలగించడం అశాస్త్రీయం

**జెవివి, యుటిఎఫ్ రౌండ్ టేబుల్ సమావేశం**

ప్రజాశక్తి - కలెక్టరేట్

బిజెపి ప్రభుత్వం సమాజంలో అశాస్త్రీయ విధానాలను పెంపొందిస్తుందని జెవివి, యుటిఎఫ్ సంయుక్తంగా నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం అభిప్రాయపడింది. జెవివి జిల్లా అధ్యక్షులు కె.గౌర్నాయుడు అధ్యక్షుడు జరిగిన ఈ సమావేశంలో ఇటీవల కేంద్ర ప్రభుత్వం రేషనలైజేషన్ ఆఫ్ సిలబస్ పేరుతో సైన్స్‌లో డార్వినిజం, ప్రత్యుత్పత్తి పాఠాలను, అలాగే ఫిజిక్స్‌లో ఎలక్ట్రో మాగ్నెటిజమ్, ఎనర్జీ పాఠ్యాంశాలను తొలగించారని అన్నారు. చరిత్రలో కొన్ని అంశాలను మొగలుల పరిపాలన, టిప్పు సుల్తాన్ చరిత్రను తొలగించారని, పొలిటిక్స్‌లో ప్రజాస్వామ్య అనే పాఠాన్ని తొలగించారని వక్తలు అన్నారు. ప్రముఖ రచయిత కవి గంట్యాడ గౌర్నాయుడు మాట్లాడుతూ విద్యార్థుల మనసుల్లో విషపు భావ జాలాన్ని ఎక్కించాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందని దీన్ని తిప్పి కొట్టాలని అన్నారు. కార్యక్రమంలో జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మహేష్, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ మురళీమోహనరావు, ఎస్‌విడి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ చలపతిరావు, ఎన్జీవో నాయకులు సత్యనారాయణ, పిఇటి సంఘ నాయకులు మురళి, ఎస్ఎఫ్ఐ నాయకులు రాజశేఖర్ ,సైన్స్ ఉపాధ్యాయులు దాసు, రామకష్ణ, సతీష్ రాజ్ ఇతర సంఘ నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్నజెవివి జిల్లా అధ్యక్షులు గౌరునాయుడు

# క్రమబద్ధీకరణకు అడ్డంకిగా మారిన నిబంధన

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఒప్పంద ఉద్యోగుల క్రమ బద్ధీకరణకు ప్రభుత్వం విధించిన నిబంధనలతో ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఒప్పంద ఉద్యోగులకు చివరకు నిరాశే మిగిలింది. 2014 జూన్ 2 నాటికి ఐదు ఏళ్లు పూర్తి చేసుకున్న ఒప్పంద ఉద్యోగులనే క్రమబద్ధీకరించాలన్న నిర్ణయంపై మిగతా వారి నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా గిరిజన సంక్షేమ విద్యాశాఖలోని 1500 మందికి పైగా సిఆర్‌టిలు క్రమబద్ధీకరణ అవకాశం కోల్పోయారు. జిల్లాలో 330 మంది సిఆర్‌టిలు పనిచేయగా ప్రస్తుతం ప్రభుత్వం నిర్దేశించిన నిబంధన వల్ల కేవలం 16 మందికి మాత్రమే రెగ్యులర్ చేసే అవకాశం ఉంది. మిగిలిన 314 మందికి రెగ్యులర్ అయ్యే అవకాశాలు లేకపోవడంతో ఇన్ని రోజులు ఎంతో ఆశతో ఎదురు చూసిన వీరికి చివరకు నిరాశయే మిగిలింది. ఉమ్మడి జిల్లాలో 250 మంది కాంట్రాక్ట్ లెక్చరర్లు పనిచేస్తుండగా ఈ నిబంధన వలన 150మందికి మాత్రమే రెగ్యులరైజ్ అయ్యే అవకాశాలు ఉండగా మిగిలిన 100 మంది లబోదిబోమంటున్నారు. వైద్యశాఖలో పనిచేస్తున్న 250 మంది ఉద్యోగులకు గానూ 70 మందికి మాత్రమే క్రమబద్ధీకరణ జరిగే అవకాశాలు కనిపించడంతో మిగిలిన వారు తమ ఉద్యోగ భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

డైలీవేజెస్‌గా గత 35 ఏళ్లుగా ఐటిడిఎ పరిధిలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న వారి పరిస్థితి ఇదే. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీతో నాలుగేళ్లుగా గంపెడాశలు పెట్టుకున్న ఒప్పంద ఉద్యోగులకు ఎండమావులే మిగిలాయి. 2014 నాటికి ఐదేళ్ల నిబంధన ఎత్తివేయాలంటూ కాంట్రాక్ట్ ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం తమ గోడు పట్టించుకోవాలంటూ వేడుకుంటున్నారు. ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణ నిబంధనపై పునరాలోచించాలని, తమకు పదేళ్ల సర్వీసు ఉన్నా క్రమబద్ధీకరణకు నోచుకోకుండా పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ముందు ఎలాంటి నిబంధనలు చెప్పని జగన్ ఇప్పుడు కోతలు విధిస్తున్నారని ఒప్పంద ఉద్యోగులు మండిపడుతున్నారు. 2014 జూన్ 2 నాటికి ఐదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న నిబంధన కాకుండా 2014నాటికి విధుల్లో ఉన్న వారందర్నీ రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

**అడ్డంకిగా మారిన ఐదేళ్ల సర్వీస్ నిబంధన**

క్రమబద్ధీకరించాల్సిన ఒప్పంద ఉద్యోగుల సంఖ్యను తగ్గించేందుకు ప్రభుత్వం మెలిక పెట్టడం ఒప్పంద ఉద్యోగులకు నష్టం. ఎన్నికల ముందు ప్రతిపక్ష నేతగా జగన్ ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి.

ఎం. మురళీకృష్ణ,
సిఆర్‌టి నాయకులు.

### అవకాశం కోల్పోయిన గిరిజన సిఆర్‌టిలు
### 330మందిలో 16మందికే రెగ్యులరైజేషన్

అంబేద్కర్ విగ్రహానికి వినతిని అందజేస్తున్న సిఆర్‌టిలు (ఫైల్)

**అందర్నీ రెగ్యులరైజ్ చేయాలి**

ఎన్నికలకు ముందు అందర్నీ క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్ ఇప్పుడు ఈ సంఖ్యను తగ్గించేందుకు కొత్త ఆంక్షలు తెరపైకి తేవడం దారుణం. అందరినీ రెగ్యులరైజ్ చేయాలి.

కె.సోములు,
సిఆర్‌టి, ఎస్‌జిటి.

**చివరికి నిరాశే మిగిలింది**

ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణకు విధించిన నిబంధనలతో ఒప్పంద ఉద్యోగులకు నిరాశే మిగిలింది. రెగ్యులర్ అవుతుందని ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నాం. కమిటీల పేరుతో కాలయాపన చేసి నాలుగేళ్ల తర్వాత కొందరికే అనడంతో దారుణం.

కె.దాశరథి,
సి ఆర్ టి, స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్

# విద్యుత్తు ఛార్జీల పెంపును ప్రతిఘటించాలి

### రౌండ్‌టేబుల్ సమావేశంలో వామపక్షాల పిలుపు
### 21న సబ్ స్టేషన్ వద్ద ధర్నా

ప్రజాశక్తి కలెక్టరేట్

రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వం సర్దుబాటు పేరుతో విద్యుత్ చార్జీల పెంపును ప్రజలంతా ప్రతిఘటించాలని వామపక్ష ప్రజాసంఘాలు పిలుపు. విద్యుత్ చార్జీలు పెంపును నిరసిస్తూ సోమవారం స్థానిక సుందరయ్య భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అధ్యక్షతన జరిగింది. ఇందులో పాల్గొన్న వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలు ఇంతవరకు రెండేళ్లకో, మూడేళ్లకో పెంచేవారు మోడీ ప్రభుత్వం ఆదేశాలకు లొంగిపోయిన జగన్ ప్రతినెలా పెంచడానికి ఆదేశాలు ఇచ్చారని అన్నారు. కరెంటు బిల్లు కాకుండా ఫిక్స్‌డ్, కస్టమర్, సర్‌ఛార్జీలతో పాటు గతంలో కాల్చిన విద్యుత్తు సర్దుబాటు చార్జీలు పేర్లతో జగన్ ప్రభుత్వం జనాన్ని పీల్చి పిప్పి చేస్తున్నారన్నారు. అసలు చార్జీల కంటే కొసరు చార్జీలు ఎక్కువయ్యాయన్నారు. ఈనెల నుండి అన్ని బిల్లుల్లో 10 శాతం నుండి 50శాతం వరకు సర్దుబాటు చార్జీలు భారం పడిందన్నారు. విద్యుత్ చార్జీలు పెంపుదలను ప్రతిఘటించాలని వామపక్ష ప్రజా సంఘాలు ప్రజలను కోరారు. ఈ మేరకు జూన్ 21న చార్జీలు పెంపునకు నిరసనగా స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన ధర్నా నిర్వహిస్తున్నాం దీనిలో ప్రజలు అందరూ పాల్గొని కోరారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం జిల్లా నాయకులు పి.శ్రీనునాయుడు, అఖిలభారత రైతుకూలీ సంఘం జిల్లా నాయకులు బి.నర్సింగరావు, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ న్యూడెమోక్రసీ నాయకులు రాజు, గిరిజన సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి పి.రంజిత్ కుమార్, సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు గొర్లి వెంకటరమణ, ఐద్వా నాయకులు గౌరి, వెంకటమ్మ, శ్రామిక మహిళా సంఘం (సిఐటియు) నాయకులు వి.ఇందిర ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.రాజశేఖర్ పాల్గొన్నారు.

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

**బలిజిపేట** : విద్యుత్ ఛార్జీల పెంపును నిలిపివేయాలని, ట్రూ ఆప్ సర్దుబాటు ఛార్జీలు వసూలు నిలిపివేయాలని, స్మార్ట్ మీటర్లు పెట్టే ఆలోచన విరమించుకోవాలని, విద్యుత్ కోతలు ఆపాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యమ్మల మన్మథరావు డిమాండ్ చేశారు. సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రజా సంఘాల కార్యాలయంలో ఆదివారం కరపత్రం విడుదల చేశారు. అనంతరం మన్మథరావు మాట్లాడుతూ ఒకపక్క వేసవి ఎండలు మండిపోతుంటే అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు అల్లాడుతున్నారన్నారు. ఒకప్పుడు సోలార్ విద్యుత్ యూనిట్ రూ.12 ఉండగా ఇప్పుడు ఉత్పత్తి ఖర్చు తగ్గి రెండు రూపాయలకు రేటు పడిపోయిందని, ఆ లెక్కన కరెంటు ఛార్జీలు తగ్గించాల్సి ఉన్నా అలా తగ్గించకుండా కార్పొరేట్లకు విద్యుత్తు రంగాన్ని ప్రైవేటుపరం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకున్నాయని విమర్శించారు. ప్రపంచ బ్యాంకు ఆదేశాలకు లోబడి విద్యుత్ రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సర్వనాశనం చేయాలని చూస్తున్నారని, కావున ప్రజలంతా ఛార్జీల పెంపును నిరసించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు ఆనందు, చంటి తదితరులు పాల్గొన్నారు.

# త్రిసభ్య కమిటీలో పిన్నింటికి చోటు

- టిడిపిలో సంధ్యారాణికి ఎదురుగాలి
- నేడు చంద్రబాబుతో భేటీ

ప్రజాశక్తి - సాలూరు

టిడిపి నియోజకవర్గ త్రిసభ్య కమిటీలో పాచిపెంట మండల పార్టీ అధ్యక్షులు, మాజీ ఎంపిపి పిన్నింటి ప్రసాద్‌బాబుకు చోటు దక్కింది. త్వరలో ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రారంభించనున్న బస్సుయాత్రకు సంబంధించి ప్రతి నియోజకవర్గం నుంచి ముగ్గురు సీనియర్ నాయకులతో త్రిసభ్య కమిటీ నియమించింది. ఉత్తరాంధ్ర జిల్లాలకు అన్ని నియోజకవర్గాలకు చెందిన 30మంది నాయకులు ఈ బస్సుయాత్రలో పాల్గొంటారు. నియోజకవర్గ ఇంఛార్జి, పొలిట్ బ్యూరో సభ్యులు జి.సంధ్యారాణి, రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్ దేవ్‌తో పాటు పాచిపెంట మండల పార్టీ అధ్యక్షుడు పిన్నింటి ప్రసాద్‌ను కూడా అధిష్టానం బస్సుయాత్ర బృందంలో ఎంపిక చేసింది. తాను మండల పార్టీ అధ్యక్షుడిగా తొలగించిన పిన్నింటి ప్రసాద్‌బాబును బస్సు యాత్రబృందంలో ఎంపిక చేయడాన్ని సంధ్యారాణి జీర్ణించుకోలేకపోతున్నారు. ఆయన్ను ఆ కమిటీ నుంచి తొలగించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోయింది. ప్రసాద్‌బాబును స్థానికంగా మండల పార్టీ అధ్యక్షుడిగా తొలగించినా పార్టీ అధిష్టానం దష్టిలో ఆయనే మండల శాఖ అధ్యక్షుడిగా వున్నట్లు తెలుస్తోంది. పొలిట్ బ్యూరో సభ్యురాలిగా ఉన్న సంధ్యారాణి ఏకపక్ష నిర్ణయాలతో నియోజకవర్గ పార్టీని సంక్షోభం దిశగా నడిపిస్తున్నారనే సంకేతాలు పార్టీ అధినాయకత్వానికి చేరాయి. దీంతో ఆమె మాటకు తగిన ప్రాధాన్యత లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గ ఇంఛార్జిగా పార్టీని ఏకత్రాటిపై నడిపించడంలో ఆమె విఫలమయ్యారనే అభిప్రాయం తెలుగు తమ్ముళ్ల నుంచి వ్యక్తమవుతోంది. గతంలో ఆమె మక్కువ మండల పార్టీ సీనియర్ నాయకులు పెంట తిరుపతిరావు పార్టీలో చేరికను తీవ్రంగా వ్యతిరేకించారు. అయినా అధిష్టానం పార్టీ ప్రయోజనాల దృష్ట్యా పెంట తిరుపతిరావును చేర్చుకుంది. మెంటాడ మండల సీనియర్ నాయకులు గెద్ద అన్నవరం, మక్కువ మండల సీనియర్ నాయకులు పెంట తిరుపతిరావు, పాచిపెంట మండల పార్టీ అధ్యక్షులు పిన్నింటి ప్రసాద్, సాలూరు మండల పార్టీ అధ్యక్షులు ఆముదాల పరమేష్, మున్సిపల్ మాజీ ఛైర్ పర్సన్ గొర్లి విజయకుమారి సంధ్యారాణి ఏకపక్ష నిర్ణయాలపై అసంతృప్తితో రగిలిపోతున్నారు. పొలిట్ బ్యూరో సభ్యురాలిగా పార్టీ టికెట్ తనకే వస్తుందనే ధీమాతో సంధ్యారాణి ఉన్నట్లు కనిపిస్తోంది. అయితే ఆమె అభ్యర్థిత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న నాయకులంతా ప్రత్యామ్నాయ అభ్యర్థిని సూచించే ప్రయత్నాల్లో తలమునకలై ఉన్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో సోమవారం చంద్రబాబు నాయుడుతో జరుగునన్న సమావేశానికి నియోజకవర్గం నుంచి సంధ్యారాణి, భంజ్‌దేవ్‌తో పాటు పిన్నింటి ప్రసాద్‌బాబు కూడా హాజరుకానున్నారు. నియోజకవర్గ స్థితిగతులపై ఈ సమావేశంలో చర్చకు వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

# మెరుగైన ఫలితాలే లక్ష్యం

- పక్కా ప్రణాళికతో విద్యా సంవత్సరం ఆరంభం
- జూనియర్ కళాశాలల్లో నైట్ వాచ్‌మేన్ పోస్టులు భర్తీ
- 'ప్రజాశక్తి'తో ఆర్ఐఒ ఆదినారాయణ ముఖాముఖి

***2023-24 నూతన విద్యా సంవత్సరంలో మెరుగైన ఫలితాలే లక్ష్యంగా కృషి చేస్తామని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి (ఆర్ఐఒ) ఎం.ఆదినారాయణ తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో రాష్ట్రంలో ఇంటర్ ఫలితాల్లో జిల్లాను మొదటి, ద్వితీయ స్థానాల్లో నిలపడమే లక్ష్యమని చెప్పారు. అందుకు అనుగుణంగా విద్యా ప్రణాళికలు అమలు చేయనున్నామని వివరించారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆయన ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. జిల్లాలో ఇంటర్ విద్యలో మెరుగైన ఫలితాల కోసం తీసుకుంటున్న చర్యలు, విద్యార్థులకు అందిస్తున్న విద్యా విధానం, సేవల గురించి వెల్లడించారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...***

\- ప్రజాశక్తి, విజయనగరం టౌన్

**ఉమ్మడి జిల్లాలో ఎన్ని జూనియర్ కళాశాలలు ఉన్నాయి? ఎంతమంది విద్యార్థులు ఉన్నారు?.**

ఉమ్మడి విజయనగరం జిల్లాలో మొత్తం 219 జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వాటిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 27 ఉన్నాయి. వీటిలో మొత్తం ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 11,318 మంది ఉన్నారు. ఈ ఏడాది మొదటి ఏడాది విద్యార్థులు బాగానే చేరుతున్నారు.

**ఎంతమంది విద్యార్థులను చేర్పించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు?.**

గతేడాది కంటే అదనంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 2 వేల మంది విద్యార్థులను చేర్పించడం లక్ష్యం. విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేర్పించేందుకు కృషి చేస్తున్నాం. ఇప్పటికే కళాశాల అధ్యాపకులను బృందాలుగా ఏర్పాటు చేసి విద్యార్థులు ఇళ్లకు పంపించే ఏర్పాట్లు చేశాం. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరడం వల్ల వచ్చే ప్రయోజనాలను విద్యార్థులకు, తల్లిదండ్రులకు వివరిస్తున్నాం. కళాశాలలో అధ్యాపకుల వివరాలు, ల్యాబ్, మౌలిక సదుపాయాలు, విద్యా ప్రమాణాలు, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరిస్తున్నారు.




**ప్రయివేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాలు ఎంసెట్, ఐఐటి వంటివి చెప్పి విద్యార్థులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. అటువంటి ప్రయత్నం ఏమైనా చేపట్టారా?.**

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎంసెట్ కోసం ప్రత్యేక తరగతులు, శిక్షణ ఇచ్చేందుకు అనుగుణంగా ప్రభుత్వాన్ని అనుమతులు కోరాం. ప్రభుత్వం నుంచి అనుమతి వస్తే ఎంసెట్ కోసం ప్రత్యేక తరగతులు ప్రారంభం కానున్నాయి.

**అధ్యాపక పోస్టులు పూర్తి స్థాయిలో భర్తీ అయ్యాయా?.**

ఈ విద్యా సంవత్సరానికి కావాల్సిన పాఠ్య పుస్తకాలు ఇంకా జిల్లాకు రాలేదు. ఇంకా రావాల్సి ఉంది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అధ్యాపకులు అన్ని సబ్జెక్టులకు సరిపడా ఉన్నారు. కాంట్రాక్టు, డైలీవేజ్ వంటి పద్ధతుల్లో కొందరు పని చేస్తున్నారు.

**ఇంటర్ ఫలితాల మెరుగుదల కోసం తీసుకుంటున్న చర్యలు ఏమిటి?.**

గత విద్యా సంవత్సరంలో ఫలితాలు తగ్గడం వాస్తవం. దానిని అధిగమించి, రాష్ట్రంలో ఈ కొత్త విద్యా సంవత్సరంలో మొదటి, ద్వితీయ స్థానంలో జిల్లాను నిలపడమే లక్ష్యంగా విద్యా ప్రణాళిక సిద్ధం చేశాం. అందుకు అనుగుణంగా అధ్యాపకులకు ఆదేశాలు, విద్యా సంవత్సరం కేలండర్ అందజేశాం. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే ఉదయం, సాయంత్రం అదనపు తరగతులు, స్టడీ అవర్స్ నిర్వహిస్తారు. దాన్ని విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే అమలు చేస్తాం.

**నాడు-నేడు పనులు ఎంతవరకు వచ్చాయి?.**

జిల్లాలో అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నాడు-నేడు పనులు జరుగుతున్నాయి. జూన్ నెలాఖరికి అన్ని పనులు పూర్తి కానున్నాయి. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. తాగునీరు, మరుగుదొడ్లు వంటి సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కారం కానున్నాయి.

**ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నైట్ వాచ్‌మేన్లు లేక అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. వాటి నివారణకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?.**

నైట్ వాచ్‌మెన్ పోస్టులు భర్తీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నైట్ వాచ్‌మేన్ పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో వారం పది రోజుల్లో భర్తీ చేస్తాం.

**ప్రయివేటు విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణకు తీసుకున్న చర్యలు ఏమిటి?.**

జిల్లాలో ప్రయివేటు విద్యాసంస్థలు ప్రభుత్వం నిర్దేశించిన విధంగా గ్రామీణ ప్రాంతాల్లో రూ.12 వేలు, రూ.15 వేలు, రూ.20 వేలు సబ్జెక్టులను బట్టి వసూలు చేయాల్సి ఉంది. అంతకంటే ఎక్కువ వసూలు చేస్తే చర్యలు తప్పవు. తల్లిదండ్రులు ఫిర్యాదు చేయొచ్చు.

ప్రజాశక్తి
www.prajasakti.com

గుమ్మలక్ష్మీపురంలో కురుస్తున్న వర్షం

## గుమ్మలక్ష్మీపురంలో భారీ వర్షం

**ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం**

ప్రచండ భానుడి భగభగలతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న ప్రజలకు ఆదివారం సాయంత్రం కురిసిన భారీ వర్షంతో ఉపసమనం లభించింది. ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన భారీ వర్షంతో పాటు ఈదురు గాలులు కూడా వీచాయి. అరగంట పాటు కురిసిన వర్షంతో కొంతమేర వాతావరణం చల్లబడింది. గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్ పేట, లక్క గూడ, పి. ఆమిటి తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు రమణరావు

## మధ్యాహ్న భోజన కార్మిక సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాశక్తి - సీతంపేట**

మధ్యాహ్నం భోజనం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీతంపేట మండల కేంద్రంలో జరిగిన మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని, వంట కార్మికులకు గ్యాస్, వంట పాత్రలు ఇవ్వాలని, అన్ని స్కూళ్లలో వంట షెడ్లు నిర్మాణం చేపట్టాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని, మధ్యాహ్నం భోజన కార్మిక సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని అన్నారు. స్థానిక యూనియన్ నాయకులు ,మధ్యాహ్నం భోజన కార్మిక సంఘం మండలం అధ్యక్ష కార్యదర్శి ఎస్. రొయ్యబారి, కె.ఉష, ఎస్. మల్లిక, వసంత కుమారి, కె.శ్రీనివాసరావు, నిమ్మక సింహాచలం, ఎస్.నాగరాజు, మండల నాయకులు ఎస్. సురేష్ తదితరులు పాల్గొన్నారు.

టిక్కబాయిలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

## టిక్కబాయిలో చేయి చేయి కలుపుదాం

**ప్రజాశక్తి: గుమ్మలక్ష్మీపురం**

మండలంలోని మండ పంచాయతీ టిక్కబాయి గ్రామం లో (హాత్ సే హాత్ జోడో అభియాన్ ) చేయి చేయి కలుపుదాం కాంగ్రెస్‌ను గెలిపిందాం రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరుచూదాం అన్న నినాదాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజల్లోకి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా డిసిసి జిల్లా అధ్యక్షులు నిమ్మక సింహాచలం మాట్లాడుతూ ప్రస్తుత కేంద్ర ,రాష్ట్రాల్లో ఉన్న అధికార పార్టీల వైఫల్యాలను చెబుతూ కాంగ్రెస్ మేనిఫెస్టో ప్రజలకు వివరించారు. రానున్న 2024 ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ విజయం సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో మండ పంచాయతీ మాజీ సర్పంచ్ లక్ష్మయ్య, దుద్దుఖల్లు సర్పంచ్ నిమ్మక నీలావతి తదితరులు ఉన్నారు.

## పశువైద్యాధికారిని నియమించాలి

**ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం**

మండల కేంద్రంలో ఖాళీగా ఉన్న పశు వైద్యాధికారి పోస్టును వెంటనే భర్తీ చేయాలని గిరిజన రైతులు కోరుతున్నారు. ఇక్కడ విధులు నిర్వహించిన పశు వైద్యాధికారి పి.లక్ష్మణరావు బదిలీపై గొరడ పశువైద్య కేంద్రానికి వెళ్లడంతో ఈ పోస్టుకు ఖాళీ ఏర్పడింది. అతనికి గుమ్మలక్ష్మీపురంలో ఇన్చార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో ఈ ప్రాంతంలో పశువులకు వ్యాధుల సోకితే వెటర్నరీ అసిస్టెంట్లు వెళ్లి వైద్యం అందిస్తున్నారు. సీరియస్ కేసులకు వైద్యం అంతంత మాత్రమే అందుతుంది. మరోవైపు వెటర్నరీ డిస్పెన్సరీ, అటెండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే తాడికొండలో వెటర్నరీలైవ్ స్టాక్ అసిస్టెంట్, అటెండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఏజెన్సీ ప్రాంతానికి కీలకంగా ఉన్న గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో పశువైద్యాధికారి పోస్టు ను అధికారులు ఎందుకు నియమించడం లేదని గిరిజన సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి పశు వైద్య అధికారిని నియమించి మెరుగైన సేవలు అందించాలని కోరుతున్నారు.

రక్షణ కవచం లేని ట్రాన్స్‌ఫార్మర్

## ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

**ప్రజాశక్తి - వీరఘట్టం**

మండలంలోని యు.వెంకంపేటలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. ఈ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎటువంటి రక్షణ కవచాలు ఏర్పాటు చేయకపోవడంతో ఎప్పుడు ఎటువంటి ప్రమాదం సంభవిస్తుందోనని గ్రామస్తులు భయమందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రక్షణ కవచం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## యమపాశాల్లా విద్యుత్తు తీగలు

**ప్రజాశక్తి - వీరఘట్టం**

గడబవలస, సంధిమానుగూడ గ్రామాల్లో ఇటీవల వీచిన పెనుగాలులకు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయాయని ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గడబవలస గ్రామ సర్పంచ్ రాయల దాలమ్మతో పాటు పలువురు గిరిపుత్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ స్తంభాల్లో ఒకవైపు ఒదిగిపోవడం వల్ల ప్రధాన వైర్లు కిందకు వేలాడడంతో గిరి పుత్రులు ఎదురు బొంగులతో పైకెత్తినారు. ఇప్పటికైనా ట్రాన్స్కు అధికారులు స్పందించి ఒరిగిన విద్యుత్ స్తంభాలను పైకి ఎత్తేలా చర్యలు తీసుకోవాలని గిరి పుత్రులు కోరుతున్నారు.

## పార్కులో పర్యాటకుల సందడి

**ప్రజాశక్తి - సీతంపేట**

స్థానిక అడ్వెంచర్ పార్కులో పర్యాటకులు సందడి చేశారు పార్కులో అందాలను ఆస్వాదించారు హ్యాంగ్ బ్రిడ్జిపై నడిచి వెళ్లారు జలవిహార లో వద్ద బోట్ షికారు చేశారు మీ ట్రైన్ వద్ద ఆడుకోనారు గన్షార్ట్ చేశారు మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించారు. చిన్నారులు గుర్రంపై స్వారీ చేశారు

# గడువు ముగిసినా పూర్తికాని పనులు

### నత్తనడకన నాడు -నేడు
### అసౌకర్యాల నడుమ చిన్నారుల చదువులు

**ప్రజాశక్తి - కొమరాడ**

ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా చేసేందుకు ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నాడు నేడు కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులు మండలంలో నత్తనడకన సాగుతున్నాయి. మండలంలోని పలు ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, గిరిజన, సాంఘిక సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు నాడు నేడు మంజూరయ్యాయి. అయితే మొదటి విడతలో మండలంలో 28 పాఠశాలలకు పూర్తిస్థాయిలో నిధులు కేటాయించారు. అప్పట్లో నాడు నేడు పనులు బాధ్యత ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకే అప్పగించడంతో అర్హత ప్రచారాలకు పోయి నిధులను కనీసం పర్యవేక్షణ లేకుండా ఇష్టానుసారంగా ఖర్చు చేశారు. ఈ 28 పాఠశాలలకు రూ.615.15 లక్షల నిధులు మంజూరు కాగా, ఇందులో సుమారు రూ.585.78 లక్షలు ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో పూర్తిచేశారు. కొంతమేరకు మొదటి విడత నాడు నేడు పనులు సక్రమంగా జరిగినప్పటికీ గిరిజన సంక్షేమ వసతి గృహాలు, సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో పనుల్లో అవకతవకలు జరిగాయి. అవకతవకలతో పాటు చేసిన పనుల్లో కూడా నాణ్యతాలోపించింది. దీంతో అప్పట్లో నిధుల పూర్తిస్థాయిలో దుర్వినియోగమైనట్లు సర్వత్రా చర్చ జరిగింది. అయినా నేటికీ బాధ్యులపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదు.

ఇక రెండో విడత నాడు నేడు పనులకు సంబంధించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఇంజనీరింగ్ అధికారులు, పాఠశాల విద్యా కమిటీ పర్యవేక్షణలో పనులు చేసేందుకు ఏర్పాటు చేశారు. గత ఏడాది నుంచి నాడు-నేడు రెండో విడత పనులు చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు చేపట్టారు. మండలంలోని కొమరాడ, గుణానుపురం, దళాయిపేట, మాదలింగి జిల్లా ఉన్నత పాఠశాలల్లోనూ, మార్కొండపుట్టి, గుణానుపురం, కోతుగుంచ, కొట్టు, దళాయిపేట, పెదఖేర్జల, కొమరాడ, అంటివలస, పెదశెడమ ఎంపిపిఎస్ పాఠశాలలు, పశురాంపురం, శివరాం, పునువలస, నయ ప్రాథమిక పాఠశాలలతో పాటు గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల (కొమరాడ), కెజిబివి (కొమరాడ)లో నాడు-నేడు పనులు చేసేందుకు రూ.640.76 లక్షల నిధులు కేటాయించారు. ఇప్పటి వరకు రూ.138.65 లక్షలు ఖర్చు అయినట్లు విద్యాశాఖ అధికారులు లెక్కలు చెబుతున్నారు. అయితే ప్రభుత్వం ముందు నుంచి వేసవి సెలవులు పూర్తయ్యే నాటికి పనులు పూర్తి చేయాలని ఆదేశాలు ఉన్నప్పటికీ పనులు ఎక్కడా పూర్తి కాలేదు. మండల కేంద్రమైన కొమరాడలో గల జిల్లా పరిషత్ హైస్కూల్లో కనీసం మరుగుదొడ్లు కూడా లేకపోవడంతో వందల మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్త మరుగుదొడ్ల నిర్మాణాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నప్పటికీ విద్యార్థులు బయటకు వెళ్లాల్సిన పరిస్థితి వస్తుంది. మరో వైపు మరుగుదొడ్లు చేస్తున్న పనుల్లో కూడా నాణ్యత లేకపోయిందని స్థానికుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. కెజిబివి అదనపు భవన నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. కనీసం గోడలు కూడా నిర్మించకపోవడంతో ఈ ఏడాది కూడా విద్యార్థులకు అవస్థలు తప్పేలాలేదు. సరిపడా తరగతి గదుల్లేకపోవడంతో విద్యార్థులు ఆరుబయటే విద్యను అభ్యసిస్తున్నారు. అలాగే ఉలిపిరి, పెద ఖర్జెల, కొమరాడ గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో ఆర్‌ఓ ప్లాంట్లు వినియోగించకపోవడంతో మూలకు చేరాయి. ఇలా మండలంలో ప్రతి పాఠశాలలో అసంపూర్తిగా పనులు జరగడంతో ఈ విద్యా సంవత్సరం అసౌకర్యాల నడుమ కొనసాగే అవకాశం ఉందని, ఎప్పటికైనా అధికారులు స్పందించి నాడు నేడు పనులు వేగవంతం చేస్తే విద్యార్థులకు ఉపయోగకరంగా విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

కొమరాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్మాణ దశలో ఉన్న మరుగుదొడ్లు

## టిడిపి టిక్కెట్ రేసులో వాడాడ రాము

### రిజర్వేషన్, యువతకు ప్రాధాన్యతపై ఆశలు

**ప్రజాశక్తి - బలిజిపేట**

మండలంలోని పెదపెంకికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వాడాడ రాముకు రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలోరిజర్వేషన్, యువతకు ప్రాధాన్యత అంశాలపై టిడిపి టిక్కెట్ ఆయకే వచ్చే అవకాశం ఉన్నట్లు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు చర్చించుకుంటున్నాయి. ఉత్తరాంధ్ర జిల్లాల్లో 34 అసెంబ్లీ స్థానాల్లో రిజర్వేషన్ పరంగా చూస్తే వాడాడ రాముకు అవకాశం ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తుంది. ఇటీవల రాజమండ్రిలో జరిగిన మహానాడు కార్యక్రమంలో యువతకు 40 శాతం రిజర్వేషన్ ప్రకటించింది. ఈ ప్రకారమైతే రాముకు టికెట్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు చర్చ జరుగుతోంది. ఇదిలా ఉండగా కిషోర్‌చంద్ర దేవ్, గుమ్మడి సంధ్యారాణి, బేబి నాయన, ద్వారపురెడ్డి జగదీష్ వంటి అగ్రనాయకుల ఆశీస్సులు కూడా రాముకు ఉన్నాయి. యువతకు ప్రాధాన్యత ఇస్తే గెలవడానికి తాను పార్వతీపురం నియోజకవర్గం నుండి ముందంజలో ఉన్నానని రాము ఆశాభావం వ్యక్తంతో ఉన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యే అలజంగి జోగారావు బలిజిపేట మండలానికి చెందిన వారే కాబట్టి బలిజిపేట నుండే తాను పోటీ చేస్తే సరైన స్పందన లభిస్తుందని అభిప్రాయపడుతున్నారు. 2012 నుంచి చంద్రబాబు నాయుడు ఈ ప్రాంతంలో పాదయాత్ర నిర్వహించినప్పుడు ఆయనతో రాము మరింత సన్నిహిత సంబంధాలు పెంచుకున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే టిక్కెట్లు కోసం ఆశాభావంతో ఉన్నారు. ఆయన ఆశను అధిష్టానం ఏ మేరకు నెరవేర్చుతుందో వేచి చూడాల్సిందే.

## నిరాశ్రయులకు మంచాలు, దుప్పట్లు పంపిణీ

**ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్**

స్థానిక శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయం ప్రాంగణంలో ఉన్న కల్యాణ మండపంలో పట్టణ కళింగ వైశ్య సంఘం సభ్యులు, మరియు స్టేట్ డైరెక్టర్ మెహర్ ప్రసాద్ సంయుక్తంగా నిరుపేద కళింగ వైశ్యులకు మంచాలు, దుప్పట్లు స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యాన పంపిణీ చేశారు. 32 మంది పట్టణ నిరాశ్రయులు వసతి గృహంలో తలదాచుకున్న నిరాశ్రులకు వీటిని అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ సేవా కార్యక్రమంలో తనను భాగస్వాములు చేసుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. కళింగ వైశ్య అంతా కూడా ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. మీరంతా ఐకమత్యంగా ఉంటే ఏ పార్టీ అయినా సరే మిమ్మల్ని తప్పక గుర్తించి మీ అభివృద్ధికి మరింత పాటు పడే అవకాశాలు ఉన్నాయన్నారు. డైరెక్టర్‌మెహర్ ప్రసాద్ మాట్లాడుతూ తనకు వచ్చిన జీతంతో పాటు తన సొంత డబ్బును వెచ్చించి తనకు తోచిన సహాయంను నిరుపేదలకు అందజేస్తున్నారన్నారు. ఇంతటి గొప్ప కార్యక్రమానికి నాంది పలికింది మాత్రం ఎమ్మెల్యేనని, ఆయన సహాయంతో తాను రెండోసారి స్టేట్ డైరెక్టర్‌గా కొనసాగుతున్నానని అన్నారు. సంఘం సేవలను సద్వినియోగంగా చేసుకొని మన ప్రాంతాన్ని మరింత అభివృద్ధి పర్చుకోవాలి పిలుపునిచ్చారు.కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బెలగాం జయబాబు, కళింగ వైశ్య సంఘం గౌరవ అధ్యక్షులు సంకా ఈశ్వరరావు, అధ్యక్షులు గుడ్ల ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ పట్నాన కిరణ్, ఆలయ చైర్మన్ యు.బుజ్జి, సంఘం పెద్దలు, సభ్యులు, వైసిపి ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు మంచాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

## బిసి సాధికారిక కమిటీలో ప్రదీప్‌కుమార్‌కు చోటు

**ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్**

తెలుగుదేశం పార్టీ బిసి సాధికారిక కమిటీల నియామకం చేపట్టింది. మన్యం జిల్లా బిసి కార్పొరేషన్ డైరెక్టర్‌గా పట్టణానికి చెందిన కెంగువ ప్రదీప్ కుమార్‌కు చోటు దక్కింది. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం విడుదల చేసిన జాబితా ప్రకారం అరకు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో విశ్వబ్రాహ్మణ సాధికార కమిటీ కన్వీనర్‌గా సాలూరు అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన పి.ఈశ్వరరావును, తూర్పుకాపు సాధికారిక అరకు పార్లమెంట్ కన్వీనర్‌గా పాలకొండ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన పి.కృష్ణమూర్తి_నాయుడును నియమిస్తూ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాలు జారీ చేసింది. అలాగే పలువుర్ని సభ్యులుగా నియమించింది. అరకు పార్లమెంట్ పరిధిలో కళింగ వైశ్య సాధికారిక కమిటీలో పార్వతీపురం అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన మాజీ ఎంపిపి హరిప్రియా థాట్రాజ్ భర్త కేవీజీ ఎం.ప్రదీప్, కళింగవైశ్య సాధికార కమిటీ డైరెక్టర్‌గా సాలూరు నియోజకవర్గానికి చెందిన ముసలినాయుడును. కొప్పల వెలమ సాధికారిక కమిటీ డైరెక్టర్‌గా పాలకొండ నియోజకవర్గానికి చెందిన డి.రాధామణిని, జంగం సాధికార కమిటీ డైరెక్టర్‌గా కురుపాం నియోజకవర్గానికి చెందిన డి.వెంకటేశ్వర్లను, కూరాకులు సాధికారిక కమిటీ డైరెక్టర్‌గా టీడీపీ రాష్ట్ర అధిష్టానం నియమించింది.

లోకేష్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న ప్రదీప్

## ప్రకృతి సేద్యానికి తొలిమెట్టు నవధాన్యాలు

**ప్రజాశక్తి - పాచిపెంట**

ప్రతి ప్రకృతి సేద్య సిబ్బంది తప్పనిసరిగా కనీసం ఐదు నుండి పదిమంది రైతులతో పూర్తిస్థాయి ప్రకృతి సేద్యాన్ని చేయించాలని మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ప్రకతి సేద్య ప్రణాళిక అమలులో భాగంగా ప్రకతి వ్యవసాయ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ మోడల్ ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను ఏర్పాటు చేయించాలని, ఈ క్షేత్రాల్లో అంతర్ పంటలు, ఎదపంటలు, కంచె పంటలు. లింగాకర్షక బుట్టలు పసుపు పళ్లేలు ఏర్పాటు చేయించాలని సూచించారు. విధిగా ఆయా క్షేత్రాల్లో నవధాన్యాల సాగు చేపట్టి గ్రామస్థాయిలో రైతులందరికీ తెలియజేయాలని అన్నారు. ప్రకతి సేద్యానికి తొలిమెట్టు నవధాన్యాలు, పచ్చి రొట్ట విత్తనాల సాగు, రెండవ మెట్టు ఘన జీవామృతం తయారీ అని అన్నారు. ప్రతి ఒక్కరు సామూహిక ఘన జీవామతం తయారీ చేపట్టాలన్నారు. కేసరిలో 3000 కిలోల ఘనజీవామతం సిఆర్‌పి క్రరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రైతు మీసాల మోహన్ రావు తయారు చేశారని, ఇలా ప్రతి గ్రామంలో మోడల్ క్షేత్రాలకు సరిపడా ఘనజీవామతం తయారు చేయించాలని తెలిపారు. వరి పంట ప్రదర్శన క్షేత్రానికి కావాల్సిన అజోల్లను ఇప్పటినుంచే సేకరించుకోవాలి సూచించారు. అలాగే గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి ప్రకృతి సేద్యం, చిరుధాన్యాలపై అవగాహన పెంచాలని సూచించారు.

ఘన జీవామృతం తయారీ విధానాన్ని వివరిస్తున్న అధికారులు

**పిఎం కిసాన్ ఇకెవైసిపి పరిశీలన**

గ్రామ వ్యవసాయ సహాయకులంతా పిఎం కిసాన్ ఇకెవైసి ఇప్పటిదాకా చేయించుకొని రైతులకు ఈనెల 30లోగా పూర్తి చేయాలని ఆదేశించారు నాందేడువలస రైతు భరోసా కేంద్రంలో ఇకెవైసి పరిశీలించి పలు సూచనలు జారీ చేశారు. అలాగే గ్రామస్థాయి రెవెన్యూ సిబ్బందితో సమన్వయం చేసుకొని సాగుతారు. సాగు హక్కు పత్రాలను త్వరితగతిన రైతులకు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గ్రామ వ్యవసాయ నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

**ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్**

స్థానిక శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీకళాశాలలో 2023-2024 విద్యాసంవత్సరంలో ప్రథమ డిగ్రీలో అడ్మిషన్ ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభమవుతుందని ప్రిన్సిపల్ డాక్టర్ చింతల చలపతిరావు తెలిపారు. మొదటి సంవత్సరం డిగ్రీలో చేరాల్సిన విద్యార్థులు నేరుగా కళాశాలకు తమ ధ్రువపత్రాలతో హాజరైతే ఆన్ లైన్ రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. కాలేజీలో అన్ని రకాల సౌకర్యాలు, మంచి బోధనా సిబ్బంది, పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలు ఉన్నందున కళాశాలలో జాయిన్ కావాలని కోరారు. కళాశాలలో బి.ఎ-పొలిటికల్ సైన్స్, అర్థశాస్త్రం, సోసియాలజీ, బికాం జనరల్ కామర్స్, బిఎస్సీలోమేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టుల కలిగిన కోర్సులు అందుబాటులోఉన్నాయని ప్రిన్సిపల్ వివరించారు. మరిన్ని వివరాలకోసం కళాశాల కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

## వరహాలగెడ్డలో ఆక్రమణలు తొలగించాలి

**ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్**

పట్టణానికి ప్రకృతి ప్రసాదంలా లభించిన వరహాల గెడ్డ ఆక్రమణలు తొలగించేదెప్పుడని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు వి.దాలినాయుడు ప్రశ్నించారు. ఆదివారం ఆ సమితి పార్వతీపురం, సీతానగరం మండల అధ్యక్షులు పాటి శ్రీనివాసరావు, బలగ శంకర్రావుతో కలిసి వరహాలు గెడ్డ ఆక్రమణలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పార్వతీపురం పట్టణంలోకి ప్రవేశించే వరహాలు గెడ్డ రైతులకు సాగునీరు అందించడంతో పాటు, పట్టణంలోని మురుగునీటినంతటినీ తనతో తీసుకువెళ్లి ప్రజలకు ఎనలేని సేవలు అందిస్తోందని, అటువంటి గెడ్డను కొందరు అక్రమార్కులు ఆక్రమిస్తున్నారన్నారని ఆరోపించారు. వరహాలుగెడ్డ పార్వతీపురంలోకి ప్రవేశించే ప్రాంతం నుండి పట్టణానికి విడిచి పెట్టే ప్రాంతం వరకు మొత్తం అడుగడుగున కబ్జా చేశారన్నారు. పట్టణ ప్రధాన రహదారిలో స్థలాల విలువ అధికంగా ఉండడంతో కొంతమంది బడా బాబులు దర్జాగా గెడ్డను కబ్జా చేసి పక్కా భవనాలు నిర్మిస్తున్నప్పటికీ రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపాలిటీ, సచివాలయం తదితర శాఖలకు చెందిన అధికారులు గానీ సిబ్బంది కానీ బడా బాబుల జోలికి వెళ్లే ధైర్యం చేయలేకపోతున్నారన్నారు. అసలు ఆక్రమణదారులు ఎంతటి వారినైనా చర్యలు తీసుకునే అధికారం ఉన్న అధికారులు వారి దగ్గర ఎందుకు భయపడుతున్నారో అర్థం కావడం లేదని ప్రశ్నించారు. అదే పేదలు, బడుగు బలహీన వర్గాలపై చూపించే ప్రతాపం పెద్దలపై ఎందుకు చూపించరని ప్రశ్నించారు. వరహాలుగెడ్డ పార్వతీపురంలోకి ప్రవేశించే ప్రాంతంలో కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు గెడ్డ స్థలాన్ని కబ్జా చేసి ప్లాట్లుగా మార్చి అమ్మకాలు చేసినప్పటికీ సంబంధిత అధికారుల్లో చలనం లేదన్నారు. వేణుగోపాల్ సినిమా హాలు మొదలుకొని వీరభద్ర సినిమా హాలు నుండి బైపాస్ కాలనీ దాటే వరకు గెడ్డను కబ్జా చేశారన్నారు. ప్రకతి వనరులు, ప్రభుత్వ ఆస్తులు కాపాడలేని అధికారులు ఎందుకని ప్రశ్నించారు. ఈ విషయమై గతంలో జిల్లా కలెక్టర్ స్పందనలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు వరహాలు గెడ్డలో జంగిల్ క్లియరెన్స్, పూడిక తీత పనులు చేపడుతున్న అధికారులు, ఆక్రమణలు మాత్రం ఎందుకు తొలగించడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వరహాలు గెడ్డ నిజస్వరూపాన్ని ప్రజలకు చూపించాల. లేని పక్షంలో న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరించారు..

## కుంటుపడిన అభివృద్ధి

**ప్రజాశక్తి - పాచిపెంట**

సాలూరు నియోజకవర్గం టిడిపి హయాంలోనే అభివృద్ధి జరిగిందని, ప్రస్తుత వైసిపి పాలనలో నిధుల్లేక అభివృద్ధి కుంటిపడిందని మండల టిడిపి అధ్యక్షులు ముఖీ సూర్యనారాయణ అన్నారు. ఆదివారం పాచిపెంటలో విలేకరులతో ఆయన మాట్లాడారు. సాలూరు నియోజవర్గం టిడిపి ఇన్చార్జి గుమ్మడి సంధ్యారాణిని విమర్శిస్తూ ఎంపిపి మాట్లాడారని, సంధ్యారాణిని విమర్శించే స్థాయి ఆమెకు లేదన్నారు. సాలూరు నియోజకవర్గం టిడిపి టిక్కెట్ ముమ్మాటికి సంధ్యారాణికేనని, ఇందులో ఇటువంటి అనుమానాలకు తోవ లేదని అన్నారు. అలాగే పాచిపెంట మండల టిడిపి అధ్యక్షుడ్ని తానేనని చెప్పారు. విలేకరుల సమావేశంలో పాంచాలి సర్పంచ్ గూడెపు యుగంధర్. ఎంపీటీసీ సభ్యులు పి.ఉమామహేశ్వరరావు. పూసర్ల నర్సింగరావు, కె.సురేష్, పల్లేడ వెంకటరమణ, చల్లా కనకారావు, ఎం.మధ్యరావు, తదితరులు పాల్గొన్నారు.

## పులి సంచరిస్తోంది.. జాగ్రత్త!

**ప్రజాశక్తి - మక్కువ**

మండలంలోని బంగారు వలస, దబ్బగెడ్డ, కోన, నాగులు దెబ్బ గెడ్డ గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల అటవీశాఖ అధికారి నారాయణరావు కోరారు. ఆదివారం పులి సంచరించిన ప్రాంతాన్ని పరిశీలించారు. పాదముద్ర గుర్తించి ఆడారుగెడ్డ వైపు వెళ్లినట్లు గుర్తించారు. ఈ పరిసరాల్లో ఉన్న గ్రామాలను అప్రమత్తం చేసేలా గ్రామసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అటవీ సిబ్బంది పాల్గొన్నారు

## నోరు ఊరిస్తుంది... కల్తీ కాటేస్తుంది..

**ప్రజాశక్తి - కురుపాం**

రోడ్డు పక్కన ఎర్రటి రంగులో కనిపించే చికెన్ పకోడీ చూస్తే ఎవరికైనా నోరూరుతుంది.. బజ్జీలు చూస్తే లాగించేయాలనిపిస్తుంది.. కానీ ఆ పదార్థాల్లోని కల్తీని గుర్తించలేకపోతున్నాం. వ్యాపారులు వినియోగించే నాసిరకం సరుకులు, కల్తీ పదార్థాలతో ఆరోగ్యం గుల్లవుతుందని తెలుసుకోలేకపోతున్నాం. అడుగడుగునా దుకాణాల ముందు చికెన్ పకోడీ, బజ్జీలు, సమోసా, ఫాస్ట్‌ఫుడ్ తయారీ కనిపిస్తున్నాయి. వీటి తయారీకి వాడే నూనె మార్చకపోవడంతో అది విషంగా మారి ప్రజా ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. పిల్లలు, యువకులు ఎక్కువగా చికెన్ పకోడీ గోబీ, నూడుల్స్ తదితర ఫాస్టుఫుడ్‌లకు అలవాటు పడడంతో ఈ వ్యాపారాలు వర్ధిల్లుతున్నాయి. ఈ పదార్థాలు ఇంట్లో చేసుకోవడానికి కొంతమందికి సమయం లేక మరికొందరికి తయారీ చేతకాక బజారులో దొరికే పదార్థాలపై ఆధారపడుతున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని పరిగణలోకి తీసుకోకుండా డబ్బు సంపాదనే ముఖ్యంగా నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి.

### నాణ్యతలేమితో ఆరోగ్యం గుల్ల పట్టని అధికారులు

నల్లగా మారిన నూనెలు వంటలు

**పర్యవేక్షణ.. నానుమాత్రం**

హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ దుకాణాలు, బేకరీల్లో అధికారులు ప్లాస్టిక్ కవర్ల వాడకాలు, తినుబండారాలపై అధికారుల తనిఖీలు తూతమంత్రంగా చేస్తున్నారు తప్ప అక్కడ తినుబండారాలు తయారీకి వాడే నూనె, ఇతర పదార్థాలపై దృష్టి పెట్టడంలేదనే ఆరోపణలున్నాయి. దుకాణాల ముందు తయారు చేస్తున్న బజ్జీలు, చికెన్ పకోడీ, గోబీ వంటి తయారీపై పర్యవేక్షణ లేదనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని ఇలాంటి ఆహార పదార్థాల తయారీపై తనిఖీలు నిర్వహించి, నాణ్యమైన పదార్థాలను ప్రజలకు అందేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

## నేరాలు ఘోరాలు

### లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

**ప్రజాశక్తి - సాలూరురూరల్**

మృతి చెందిన రమణ

మండలంలోని శివరాం పురానికి చెందిన జర్జాపు వెంకట రమణ (56)ను లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. వెంకటరమణ ఆదివారం ఉదయం తన అత్తవారి గ్రామమైన దత్తిరాజేరు మండలం దాసరిపేట టివిఎస్ ఎక్సల్‌పై వెళ్తుండగా పెదమానాపురం అడ్డు రోడ్ వద్ద విజయనగరం నుండి వస్తున్న లారీ ఢీకొంది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. రమణకు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు రమేష్ ఎపిఎస్‌పి 5వ బెటాలియన్‌లో పోలీసుగా పనిచేస్తుండగా, రెండో కుమారుడు భాస్కర రావు ఆర్మీ జవాన్‌గా అస్సాంలో పనిచేస్తున్నాడు. పోస్ట్ మార్టం నిమిత్తం గజపతినగరం ప్రభుత్వాసుపత్రికి మృతదేహాన్ని తరలించారు.

### ఆటో బోల్తా పడి ఒకరు మృతి

**ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్**

మండలంలోని డోకిశీల పంచాయతీ బుచ్చింపేట దగ్గర ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందాడు. మక్కువ మండలం తెలగడవలస నుంచి సంగంవలస పంచాయతీ మడకవానివలస వెళ్తుతుండగా ఆటో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో యడ్ల పాపారావు(40) మృతి చెందాడు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. స్పందించిన స్థానికులు వారిని పార్వతీపురం జిల్లా హాస్పిటల్‌కి తరలించారు. మక్కువ మండలం నుంచి మడకవానివలస గ్రామానికి ఓ కార్యక్రమానికి ఆటోలో వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది.